# కథ ఖరీదు?!!

మావారికో జబ్బుంది.

ఎవరికి జబ్బు చేస్తే బాధ వాళ్ళే పడడం సహజం. కాని జబ్బు ఆయనది. బాధ నాది. సైడ్ ఎఫెక్ట్ అన్నమాట. ఉత్తరోత్రా కాన్సరుకి మందు కనిపెట్టవచ్చునేమో కాని ఈజబ్బుకి మందులేదు.

ఇంతకీ ఏంcవాc జబ్బు?

ఏcవాc కథ!

అతను ఆఫీసుకి కార్లో వెళ్తారు.

ఇంటికి కార్లోనే వస్తారు.

మధ్యలో ఊరంతా తిరుగుతారు. ఒకె.

డ్రైవరు కూడా ఉన్నాడు.

డబుల్ ఒకె.

ఇంటికొచ్చేక 'అమ్మీ, బుగ్గలు పీకేస్తున్నాయి. అర్జంటుగా రెండు సిగరెట్టు పెట్టెలు తెచ్చి పెటుదూ' బతిమాలారు. ఆమాట డ్రైవరుండగా చెప్పరు.

తేవడానికి నాకు, అమ్మడానికి ఆ కొట్టువాడికీ ఏం అభ్యంతరం లేదు. ఆడది సిగరెట్లు కొనడం బావుండదని నేనెప్పుడూ అనుకోలేదు.

వ్యసనానికి ఆడ, మొగ భేదం లేదు. అంచేత నేను కాలుస్తానని అనుకున్నా నాకేం బాధ లేదు.

మా విశాఖపట్నం జిల్లాలో లేబరు ఆడవాళ్లు చుట్ట నిప్పువైపు నోట్లోపెట్టుకొని–దాన్ని అడ్డపొగ అంటారు– కాలుస్తారు.

వాళ్ళు చుట్ట కాలుస్తే లేనితప్పు నేను సిగరెట్లు కాలుస్తే ఉంటుందని నేననుకోను.

నాకర్థం కానిదొక్కటే.

ఊరంతా తిరిగిన మనిషి సిగరెట్లు ఎందుకు కొనుక్కోరూ!

పోనీ తను కొనుక్కోవడానికి డిగ్నిటీకి తక్కువా అనుకుంటే వీధిలో మొక్కలన్నిటికీ నీళ్ళుపోస్తారు. డ్రైవర్ని కొనమని అడగవచ్చు!

ఉహూ! తను కొనుక్కోరు. డ్రైవరు చేత కొనిపించరు. అదంతే.

నేనీ బాధ పడలేక సిగరెట్ పాకెట్లు హోల్‌సేల్లో కొని బీరువాలో పడేస్తాను. అయితే ఎలా కనిపెట్టారో - అతనిది కుక్కపసి-నన్ను తెమ్మనకుండా తనే బీరువా లోనుండి తీసుకోవటం ప్రారంభించేరు.

నాప్రాణం హాయిగానే ఉంది. అయితే బజారుకి వెళ్ళేటైము కలిసొచ్చింది కాబట్టి కాల్చేపెట్టెల సంఖ్య పెరిగింది, దాంతో ఖర్చు పెరిగింది.

అయితేనేం డబ్బెక్కువని మందుకొనడం మానేస్తావాః?

"ఏవేమైనా గానీ అమ్మడూ, నువ్వు తెలివైన దానివేనే. ఒప్పుకోవాలి మరి...నువ్వు హోల్‌సేల్‌లో కొంటున్నావు కదా. ఓ పని చెయ్యి. నాకు సిగరెట్ పాకెట్ ఇచ్చినప్పుడల్లా రీటైల్ ధర తీసుకో - నేనెప్పుడిస్తున్నాను సార్ మీరే తీసుకుంటున్నారు. పైగా దీనితో అరు. నోట్ చేసుకో" అని నోటి లెక్కలు - "మార్జిన్ మనీతో ఏదైనా కొనుక్కోఏవంటావ్?" ఉచిత సలహా.

ఏవంటాను. ఇలాంటి దిక్కుమాలిన సలహాలు ఇవ్వద్దంటాను.

ఏడింగ్ ఇన్సల్టు టు ఇంజరీ. (Adding insult to injury)

ఇంతకీ ఈ సిగరెట్ కథంతా దేనికి?

ఇది కథకాదు. ఉపోద్ఘాతం మాత్రమే.

ఆవేళ సిగరెట్ల స్టాకు అయిపోయింది. అర్జంటుగా పరిగెత్తేను. అప్పుడు బంజారాహిల్స్‌లో ఉండేవాళ్ళం. ఆ కొండలు ఎక్కలేక ఒకటే అయాసం. ఆయాస పడుతూనే గుమ్మంలో కాలుపెట్టేను.

"అదిగో మాటలో వచ్చింది. నీకు నూరేళ్ళు ఆయుష్షు" - ఎందుకూ ఈ సిగరెట్టు పాకెట్లు మొయ్యడానికా!- 'నీ గురించే అనుకుంటున్నాం' ... ఏవఁని! అలనాడు సుమతి మొగుడ్ని నెత్తిమీద పెట్టుకొని మోసింది! సావిత్రి యమధర్మరాజుతో దెబ్బలాడింది. మా ఆవిడ మోడర్న్ పతివ్రత

కాబట్టి సిగరెట్టు పాకెట్లు తెస్తోందనా?...

ఔను మరి. అకాలంలో సిగరెట్లు లేవుకదా!...

"ఈయన శాస్త్రిగారి ఫ్రెండుట, విశాఖపట్నం నుండి వచ్చేరు" పరిచయం చేశేరు.

సిగరెట్టు పెట్టె ఈయనకీ, నమస్కారం ఆయనకీ పెట్టి లోపలికి వెళ్ళేను.

కాఫీ కలుపుతున్నాను.

"పాపం మనిషి మహా మొహమాటస్తుడిలా ఉన్నాడు. మనలాగే శాస్త్రిగారి శిష్యుడట. శాస్త్రిగారెపుడూ మన గురించే చెప్తారట. ముఖ్యంగా నీ గురించి...సుందరమ్మగారు బ్రహ్మాండంగా వంట చేస్తారూ అని..."

కప్పులు ట్రేలో పెట్టేను.

'వచ్చి కొంచెం సేపు మాట్లాడు. బావుండదు' ట్రేతో నేను.

వెనకే మావారు.

అప్పుడు చూశేను అతన్ని.

పాలిస్టర్ పంచ, సిల్కు లాల్చీ, మెళ్ళో గొలుసు అచ్చం నాటకాల వాడిలా ఉన్నాడు.

శాస్త్రిగారి ఫ్రెండ్సంటే మాకూ గౌరవమే కాని ఎందుకో ఇతన్ని గౌరవించాలనిపించలేదు.

ఇతను స్టేజి మీద నాటకాలాడేవాడుకాడు.

జీవితంలో నాటకాలాడే వాడు అనిపించింది.

"మీ ఉభయుల గురించి శాస్త్రిగారు ఎప్పుడూ చెప్తూ ఉంటారు."

నా అంచనా తప్పుకాదు.

హిపోక్రసీ, లౌక్యం, నాటకం.

ఇబ్బందిగా మొహం పెట్టేను.

"ఇంతకీ ఈమధ్య టీ.వి.కి తీస్తున్నారుట..." మావారి ప్రాంప్టింగ్.

అదీ అసలు సంగతి.

"మీలాంటి పెద్దలందరి కథలు 'కథాతోరణం' అన్న పేరుతో తియ్యాలనుకుంటున్నాను"

"శుభం" మావారి ఆశీర్వచనం.

"ఓం ప్రథమంగా మీ దగ్గరకే వచ్చేను. మీరో మంచి కథ ఇస్తే..."

"ష్యూర్" మావారి హామీ.

తుళ్ళి పడ్డాను.

ఎవరు టీ.వి.క్కాని, సినిమాక్కాని కథ అడిగినా మావారు ఇవ్వరు.

"ఎప్పటికైనా నేను తీస్తాను" అని ఆయన ఆశ.

"నేనే డైరెక్టు చేస్తాను" అది అతని కోరిక.

"నాన్న సినీమా తియ్యడవేఁవిఁటి? ఆ ఫీల్డుక్కావల్సిన లౌక్యం, గుట్టు ఈరెండు ఈయన దగ్గర లేవు. ఎవడికో పారేస్తే ఆ బాధలేవో వాడే పడతాడు. ఏఁవిఁటమ్మా ఈచాదస్తం" మా పిల్లలు గోల.

మరిదేవిఁటి?

"శాస్త్రిగారు మాక్కావల్సినవారు. ఆయన ఫ్రెండు కాబట్టే ఇస్తాను. లేకపోతే సాధారణంగా నేనెవరికీ ఇవ్వను".

అమ్మయ్య సమాధానం దొరికింది.

"మరైతే ఎప్పుడు రమ్మంటారు?"

"మీరేం అనుకోకండి. మా ఆవిడ ఎంత జాగ్రత్త మనిషంటే, ఆవిడ దాచిన వస్తువు వెతకాలంటే పోలీసు కుక్కలు కావల్సిందే. పుస్తకాలన్నీ ఎక్కడో దాచేసింది. శ్రమ అనుకోకపోతే సాయంత్రం రాగలరా?"

"అమ్మమ్మ! ఎంతమాట! శ్రమేఁవిఁటి? విత్ ప్లెజర్. వస్తానండీ. వస్తాను మేడమ్".

అతను వెళ్లిపోయేడు.

నేనూ వంటింట్లోకి వెళ్తున్నాను.

"ఏ కథ ఇద్దావంటావ్?" మా వారి ప్రశ్న.

అనవసర ప్రశ్న.

నేను చెప్పినట్టు ఎలాగూ చెయ్యరు.

"మీ ఇష్టం. ఇంతకీ కథకి ఎంతిస్తున్నారో ఎవరినైనా అడిగితే?"

"ఛ! ఛ! కథకావాలని ఇంటికొచ్చిన పెద్ద మనిషిని డబ్బు అడగటం ఏం బావుంటుంది?"

ఏది బావుంది కనుక!

సాయంత్రం అయింది. అతనూ వచ్చేడు. ఒక చిన్న ప్లాస్టిక్ కవర్లో మూడు బంగినపల్లి మామిడి పళ్ళు తెచ్చి టేబులు మీద పెట్టేడు.

కాఫీలూ, కబుర్లూ అయ్యేక అతను కథ, పెర్మిషన్ తీసుకొని వెళ్లిపోయేడు.

డబ్బు అతను చెప్పలేదు.

ఈయన అడగలేదు.

అంతే.

మరో ఆర్నెల్ల తరవాత టీ.వి.లో ఏదో టెలిఫిల్మ్ వస్తోంది.

ఆ డైలాగులు ఎక్కడో విన్నట్టనిపించింది.

ఎప్పుడూ టీ.వి. చూడనిదాన్ని ఆగి చూశేను. గుండె గతుక్కుమంది.

మా కథే.

దాన్ని కొంచెం అటూ, ఇటూ సాగదీసి టెలిఫిల్మ్ తీశేడు.

టైటిల్స్ చూశాను.

అతనే, సందేహంలేదు.

మావారికీ బాధ అనిపించిందేమో!

"కథా తోరణం అన్నాడు..." గొణిగేరు.

ఈ పెద్దమనిషి జెడ్జి ఉద్యోగం ఎలా చేస్తున్నాడో, ప్రపంచజ్ఞానం బొత్తిగా లేదు.

"ఒక్క ఆకు తోరణం ఎలా అవుతుంది?" నాకసలే మండిపోతోందేమో కొంచెం గట్టిగానే అన్నాను.

"అంటే?"

"మూడు మావిఁడిపళ్ళకి కథ మరెక్కడా దొరకలేదేమో"

"పోన్లెస్తూ. భావ దారిద్ర్యం వాడిక్కాని మనకి లేదు." అర్థంలేని సమర్థన.

"అన్నట్టు చెప్పడం మరిచిపోయేను. అతను శాస్త్రిగారికి ఫ్రెండుకాదుట. ముఖపరిచయం అంతే."

మరిచిపోవటం కాదు. చెప్తే తిడతానని చెప్పలేదు.

ఇంతకీ మనం చెయ్యగలిగిందేం లేదు.

"ఏఁవిఁటోస్మీ! జీవితం ఎప్పటికప్పుడు కొత్త పాఠాలు నేర్పుతూనే ఉంటుంది." ఈయన మెట్ట వేదాంతం.

నేర్చుకునే వాళ్ళకి–మనకా్కదు.

నవ్వేను. కొంచెం గట్టిగానే నవ్వేను.

"ఎందుకానవ్వు?"

"ఏదో జ్ఞాపకం వచ్చి..."

"చెప్తే నేనూ నవ్వుతాను కదా"

పకపక నవ్వేను. నవ్వుతూనే చెప్పేను.

'అతనిచ్చిన మావిఁడి పళ్ళు జ్ఞాపకం వచ్చి...'

"అదేఁవిఁటి?"

"నీకో సిగరెట్ ఇస్తాను. నాకో శతకం ఇస్తారా శ్రీశ్రీ అన్నాడు చక్రపాణి – అన్న శ్రీశ్రీ మాట గుర్తొచ్చింది."

ఆయనా నవ్వేశేరు.

శ్రీశ్రీ గారూ! ఎంత నిజం.

*("ఆంధ్రప్రభ" దీపావళి సంచిక, 10–11–1996)*

★ ★ ★